క్లుప్తంగా

ఘనంగా మహాచండీ హోమం



మహాలింగార్చనలు చేస్తున్న రుత్వికులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలో ఉన్న విజయదుర్గ ఆలయంలో సోమవారం మహాచండీ హోమంలో భాగంగా అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్రార్చనలు, మహాలింగార్చన, సూర్యనమస్కారాలు జరిగాయి. సప్తశతి పారాయణ, గ్రహజపాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతివ్వాలని విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌సీ సిబ్బంది

జి.సిగడాం:తమ సమ్మెకు మద్దతు ఇవ్వాలని స్థానిక ఎంఆర్‌సీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కోరారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్‌ను పెంట యూపీ పాఠశాలలో సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కెంబూరి చిన్న సూరి, పి రంగనాథం, కె.పుష్పలత, వి, నాగరాజు, ఎం .తవిటిరాజు ఉన్నారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురం గ్రామంలోని స్కై వ్యవసాయ కళాశాల విద్యార్థులు తిరుపతి వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఏఫిలియేషన్ క్రీడా సాంస్కృతిక, సాహిత్య పోటీలు– 2023లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో మెరుగైన ప్రదర్శన చేశారు. సోలో పోక్ నృత్యం, జావిలిన్‌త్రో క్రీడలో పి.నాగదీపిక రెండో స్థానంలో నిలవగా.. వ్యాసర రచనలో డి.దివ్యదీపిక రెండో స్థానం, బెస్ట్ యాక్టర్ విభాగంలో ఆర్‌వీఎస్ ప్రసన్న రెండో స్థానం, కర్నూనింగ్‌లో పి.గుణసాయిశేఖర్ రెండోస్థానల్లో నిలిచారు. వీరిని సోమవారం స్కై కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష, ఇతర విభాగాధిపతులు, ఫ్యాకల్టీ సభ్యులు అభినందించారు.

అయ్యప్ప దీక్షలతో సమానత్వం



ఇరుముడి ధారణలో అయ్యప్ప భక్తులు

గార: అయ్యప్ప దీక్షలతో ప్రతి ఒక్కరిలో సమానత్వం ఏర్పడుతుందని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి, అయ్యప్ప సేవా సమాజం కన్వీనర్ శ్రీరంగం మధుసూదనరావు అన్నారు. దీపావళిలోని ధర్మశాస్తా జ్ఞానాశ్రమంలో మండల దీక్షలు పూర్తిచేసుకున్న స్వామి భక్తులకు ఇరుముడి ధారణ జరిగింది. అనంతరం 40 మంది స్వాములు శబరిమలై బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వాములు రుప్ప రమణ, మెయ్యి అశిరినాయుడు, గెంజి పాపారావు, చల్ల లక్ష్మీనారాయణ, లక్ష్మణరావు, జగన్నాథం పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ఎచ్చెర్ల: వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు ఉషాశ్రీ అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో ఆరోగ్యసిబ్బందితో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు, పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుల నియామకం



రఘురాం

జి.సిగడాం: స్థానిక రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుల నియామకం జరిగింది. ఆనందపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు వజ్జిపత్తి రఘురాంతోపాటు మీసాల రామకృష్ణ, బొల్లు రవికుమార్, గట్టెం అప్పలరాజు, పొందూరు అప్పారావులను కమిటీ సభ్యులుగా నియమిస్తూ సెంట్రల్ రైల్వే బోర్డు అధికారుల నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైల్వేస్టేషన్ అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని సభ్యులు తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి



గుడివీధిలో మూలవిరాట్‌కు అభిషేకాలు



నక్కవీధి శివాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి అలంకరణ



బలగ బాలత్రిపుర కాలభైరవ పీఠంలో స్వామికి నక్షత్ర హారతి



బలగలో పాలకావిళ్లతో చిన్నారులు



జి.సిగడాం: కంచికామాక్షి అమ్మవారి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న భక్తులు



తమ్మినాయుడుపేటలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ వేడుకలు



బలగ అయ్యప్ప స్వామి ఆలయంలో అభిషేకాలు



పాతశ్రీకాకుళం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



గుజరాతిపేట శ్రీరాజరాజేశ్వరీపీఠంలో స్వామికి హారతి..



ఎచ్చెర్ల క్యాంపస్: పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని పలు దేవాలయాల్లో సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయం వద్ద గంగామాత గుడిలో కొలువు దీరిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామికి మహా క్షీరాభిషేకాలు జరిగాయి. భక్తుల స్వహస్తాలతో ప్రధానమూర్తికి అభిషేకాలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆరవెల్లి హరగోపాలశర్మ, కమిటీ సభ్యులు బోయిన రమణయ్య, ఎం.ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ ధర్మకర్త అశ్వినీ కుమార్, అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బలగ అయ్యప్ప స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా చిన్నారి మణికంఠలు పాలకావిళ్లను స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకులు దేవరకొండ శంకర నారాయణశర్మ, ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు, భక్తులు పాల్గొన్నారు. బలగ బాలత్రిపుర కాలభైరవ పీఠంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటెశ్వరస్వామి దేవాలయంలో స్వామికి పంచామృతాభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యోగెశ్వరరావు, బెహరానాగేశ్వరరావు పాల్గొన్నారు. గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ దేవి పీఠంలో పెంట రామచంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి 108 కలశాతో క్షీరాభిషేకం నిర్వహించారు.

జి.సిగడాం: వాండ్రంగి, సంతవురిటి, చీడిపేట గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్టి పూజలు ఘనంగా జరిగాయి. కంచికామాక్షమ్మ ఆలయంలో జిల్లా విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయాచారి దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

– ఎచ్చెర్ల క్యాంపస్: మండల కేంద్రం ఎచ్చెర్లలోని గిరిజా ముక్కంటేశ్వర ఆలయ ఆవరణలో సుబ్రహ్మణ్య స్వామికి అర్చకులు పెంటా సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం చేశారు.

శ్రీకాకుళం కల్చరల్: ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటలోని లలితా చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్వామివారి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్‌బాబు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గార: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



రణస్థలం: సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

గార: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. సోమవారం సతివాడ సచివాలయం వద్ద ఎంపీపీ గొండు రఘురామ్ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతం, ప్రాంతం అన్న భేదం లేకుండా అర్హులందరికీ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యాళ్ల సుజాత నారాయణమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీటీసీ పొదిలాపు శ్రీరాములు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, ఎంపీడీవో సంజీవి రమణయ్య, మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, వైస్ ఎంపీపీలు అరవల రామకృష్ణ, అంధవరపు బాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రణస్థలం: గతంలో ఏన్నడూ లేనంతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సంక్షేమ కాంతులు నింపి ప్రజల కళ్లల్లో ఆనందాన్ని తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. తెప్పలవలస పంచాయతీలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ ప్రజల పక్షపాతిగా ఉన్నారన్నారు. కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు అందజేస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ ప్రభుత్వం ఇంత పారదర్శకంగా ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేసిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకట రెడ్డి, నాయకులు బొమ్మలాట శ్రీరాములు, కొయ్యి సోముల రెడ్డి, దన్నాన హరి, పిన్నింటి లక్ష్మంనాయుడు, యాగాటి నాగరాజు, తోట అప్పన్న, గొర్లె అప్పలనాయుడు, తోట చిన్న, అదినారాయణ, అచ్చిబాబు, సింహాద్రి, పట్నాన పెంటయ్య రెడ్డి, సీమయ్య, చినరామినాయుడులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ఎచ్చెర్ల: కేశవరావుపేట సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న రైతులు



జి.సిగడాం: కూరగాయిలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన లాభాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ సమన్వయకర్త సూర్యనారాయణ అన్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వినియోగించడం వలన ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పండించవచ్చన్నారు. కేశవరావుపేట, ధర్మవరం, పొన్నాడ, బొంతలకొడూరు గ్రామాల్లో సేంద్రియ ఎరువుల తయారీపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు.

జి.సిగడాం: కూరగాయల సాగులో సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించగలరని నేచరల్ యూనిట్ ఇన్‌చార్జి రాజేష్, శివ అన్నారు. మండల కేంద్రం జి.సిగడాంలో సేంద్రియ ఎరువలతో సాగుచేసిన కూరగాయలను ప్రదర్శించారు. పంచాయతీ కార్యదర్శి తులసీ ప్రసాద్ సాహు ఉన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వస్త్రాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

గార:

మండల కేంద్రం గారలోని సంతతోట సమీపంలో ఏసుక్రీస్తు మహిమ మందిరంలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బిషప్ వి.జాషువా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో తహశీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీఓ సంజీవి రమణయ్య, డీటీ సీహెచ్‌జీవీవీ ప్రసాదరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తిలు హాజరై క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. రెవరెండం డాక్టర్ అల్ఫన్స్ క్రీస్తు సందేశం వినిపించారు. ఎల్. ప్రిస్సిల్లా ప్రత్యేక సందేశం తెలియజేశారు. ముందుగా ఆరాధన గీతాలు, క్యాండిల్ సర్వీస్, కేక్ కటింగ్ నిర్వహించారు. పేదలకు, వృద్ధులకు, పాస్టర్లకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో ఎలిజిబెత్ రాణి, షేరా తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



కొవ్వొత్తులతో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. వప్పంగి గ్రామ సచివాలయంలో సోమవారం రాత్రి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన స్త్రీలకు, 21 నిండిన అబ్బాయిలకు మాత్రమే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఎం వి.సుజాత, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉమాజఠలేశ్వరునికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వర దేవాలయంలో మార్గశిర సోమవారం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అంతకుముందు ఆలయ అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి నారికేళ జలంతో అభిషేకాలు చేశా. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గరిమెళ్ల ఆశయ సాధనకు కృషి

శ్రీకాకుళం కల్చరల్: భౌతికంగా కనుమరుగైనా గరిమెళ్ల సత్యనారాయణ ఆశయాలు, ఆలోచనలు సజీవంగా ఉన్నాయని సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు అన్నారు. సోమవారం గరిమెళ్ల వర్ధంతి సందర్భంగా నాగావళి తీరంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే, సామ్నా, అరసం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాల ధరించిన విద్యార్థికి అనుమతి నిరాకరణ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు అయ్యప్ప మాలధారణతో వచ్చిన విద్యార్థిని లోపలకు అనుమతించని ఘటన సోమవారం చోటుచేసుకుంది. విద్యార్థిని ఇంటికి వెళ్లిపోవాలని చెప్పడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఈ విషయమై రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ లక్ష్మణరావు వద్ద ప్రస్తావించగా తమ దృష్టికి సమాచారం వచ్చిందన్నారు.

'కుమారుని తీరుతో వేదన చెందుతున్నా'



మాట్లాడుతున్న వరదా కొండబాబు

శ్రీకాకుళం క్రైమ్ : కుమారుని తీరుతో తీవ్రంగా వేదన చెందుతున్నానని, వయోవృద్ధుల సంక్షేమం, బాధ్యత చట్టాన్ని సక్రమంగా అమలయ్యేటట్లు అధికారులు చూడాలని శ్రీకాకుళంలోని నాగావళి హోటల్ యజమాని, మేనేజింగ్ డైరెక్టర్ వరదా కొండబాబు కోరారు. ఆయన సోమవారం నగరంలోని రోటరీక్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను కని వారు వృద్ధిలోకి వస్తే ఆనందిస్తారని, వృద్ధాప్యంలోకి వచ్చాక ఆదరిస్తారనే నమ్మకంతో ఉంటారని, కానీ తనకు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన కష్టార్జితంతో నిర్మించిన నాగావళి హోటల్‌ను కుమారుడు ఆనంద్ సొంతం చేసుకుని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాడని, ఆదాయ మార్గంగా ఉండే హోటల్ నిర్వహణకు తనను అనుమతించకపోవడంతో 87 ఏళ్ల వయసులో నాలుగు నెలలుగా బయట గడపాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. తనతో పాటు ఇద్దరు కుమార్తెలకు, కుమారుడికి నాలుగు సమభాగాలుగా రాసినా మూడు సమభాగాలు (కొండబాబు తదనంతరం) తనకే ఇవ్వాలని మనవడితో కలిసి గొడవపడుతూ తీవ్ర మనోక్షోభకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. భార్య సరోజ చనిపోవడంతో కుమార్తెలు ఆదరిస్తున్నారనే కోపంతో వారితోనూ గొడవ పడ్డాడని, వందేళ్ల నాటి ఆస్తుల డాక్యుమెంట్లు, కంపెనీ రికార్డులు, హోటల్ పత్రాలు దొంగిలించడమే కాక తన వ్యక్తిగత సహాయకుడిని కూడా కొట్టారని తెలిపారు. దీనిపై రెండో పట్టణ స్టేషన్‌కు ఫిర్యాదు చేస్తే కుటుంబ సమస్య, సివిల్ మ్యాటర్ మీరే తేల్చుకోవాలని సూచించారని, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లకు కూడా గత సెప్టెంబర్‌లో విన్నవించానని తెలిపారు. తనపై జరిగిన దౌర్జన్యం వీడియో ఫుటేజీని మీడియాకు అందించారు.

కోర్టు పరిధిలో ఉంది..

వరదా కొండబాబు ఆరోపణలపై ఆయన కుమారుడు వరదా ఆనంద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. అది లీగల్ కేసు అని, ఇంకా కోర్టు పరిధిలోనే కేసు ఉందని తెలిపారు. తమ మధ్య ఎలాంటి తగాదాలు లేవని చెప్పారు. అనారోగ్యం కారణంగానే తన తండ్రి అలా మాట్లాడుతున్నారని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్నందున అంతకుమించి మాట్లాడలేనని తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలు ఉత్తమ ఫలితాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయని శ్రీకాకుళం హయాతీనగరం ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి అన్నారు. పాఠశాల 5వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. వసతి, ఆరోగ్యం, సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి సాయం

వజ్రపుకొత్తూరు: రెయ్యపాడు గ్రామానికి చెందిన మద్దిల ఉమా అనే గృహిణికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో ఉద్దాన హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు సోమవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కీలు ఈశ్వర రావు, సభ్యులు వెంకటేష్, హేమారావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.